క్లుప్తంగా

కారుణ్య నియామకం



దుర్గా మణికంఠకు కారుణ్య నియామక పత్రం అందిస్తున్న కమిషనర్

బోట్‌క్లబ్: కాకినాడ నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తూ మరణించిన పి.పెంటమ్మ కుమారునికి కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు బుధవారం కారుణ్య నియామక ఉత్తర్వును అందజేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆమె కుమారుడు పి.దుర్గా మణికంఠను రెండో సర్కిల్‌లోని శానిటరీ మేస్త్రీగా నియమిస్తూ ఆదేశాలిచ్చారు. ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్ పాల్గొన్నారు.

వామనావతారంలో సీతారామస్వామి



వామనావతారంలో దర్శనమిచ్చిన సీతారామస్వామి

బోట్‌క్లబ్: రజిత చిన్న దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారికి ఆలయ ప్రధానార్చకుడు భావవరపు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ వెయిట్ లిఫ్టింగ్‌కు అవినాష్ ఎంపిక



అవినాష్‌ను అభినందిస్తున్న దృశ్యం

బాలాజీచెరువు: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో డిసెంబర్ 9 నుంచి 12 వరకూ నిర్వహించే సౌత్ జోన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ఫైనలియర్ విద్యార్థి అవినాష్ ఎంపికయ్యారు. జేఎన్‌టీయూకేలో ఇటీవల జరిగిన ఇంటర్ కాలేజియేట్ వెయిట్ లిఫ్టింగ్ టోర్నమెంట్‌లో ప్రతిభ చూపి ఈ అర్హత సాధించారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో విద్యార్థి అవినాష్‌ను ప్రిన్సిపాల్ టి.శ్రీకాంత్, కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు, కరస్పాండెంట్ చిరంజీవిని కుమారి, డైరెక్టర్ కృష్ణంరాజు, ఏవో వర్మ, ఫిజికల్ డైరెక్టర్ కాశయ్య అభినందించారు.

ఎంఎస్ఎన్‌లో కార్తిక వన సమారాధన

బాలాజీచెరువు: ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి అధ్యక్షతన కార్తిక వన సమారాధన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నన్నయ వర్సిటీ వీసీ డాక్టర్ కె.పద్మరాజు హాజరయ్యారు. కళాశాల ఆవరణలో ఉసిరిచెట్టుకు పూజలు చేశారు. క్యాంపస్‌లో జరుగుతున్న కార్యక్రమాలు, అభివృద్ధిని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఈసీ సభ్యులు విజయనిర్మల, డాక్టర్ నూకరత్నం, జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ సూర్యప్రకాష్, ఈడీ దయాకర్ పాల్గొన్నారు.

ఈవీఎంల పంపిణీ కేంద్రం పరిశీలన

బోట్‌క్లబ్: సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా మెక్లారిన్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను కాకినాడ సిటీ నియోజకవర్గ ఈఆర్వో, కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు బుధవారం పరిశీలించారు. పంపిణీ కేంద్రం వద్ద భద్రత, ఏర్పాట్లు, ఇతర అంశాలపై అక్కడ సిబ్బందిని ఆరా తీశారు. వారికి పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఏఈఆర్‌ఓలు సీతాపతి, మురళీకృష్ణ, సర్వేయర్ ఆచార్యులు ఉన్నారు.

దుమ్ములపేటలో పర్యటన

కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు బుధవారం దుమ్ములపేటలో పర్యటించారు. ఆ ప్రాంతంలోని కల్వర్టు నిర్మాణ పనులు, డ్రైనేజీలను పరిశీలించారు. అక్కడున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ లాజర్, పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. పారిశుధ్య పనులను కూడా పర్యవేక్షించారు. చెత్తను రోడ్లపై, డ్రైనేజీల్లో వేయకుండా పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. తడి-పొడి చెత్తను విడిగా సేకరించాలని, ఈ మేరకు ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు.

వైద్య శిబిరం

కాకినాడ సిటీ: కాకినాడలోని ధనలక్ష్మి బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం రామారావుపేటలోని బ్యాంకు కార్యాలయంలో వైద్య శిబిరం నిర్వహించారు. బ్యాంకు మేనేజర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని చూరగొనడంతో బ్యాంకు మంచి లాభాల బాటలో నడుస్తోందన్నారు. ప్రజలకు పొదుపుతో పాటు ఆరోగ్యం ముఖ్యమని, అందుకే వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఖాతాదారులకు నేత్ర, రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

మాటే.. అభివృద్ధి మంత్రం

- గడప గడపకూ.. నిధులతో సమస్యలకు మోక్షం
- హామీలు నెరవేర్చిన ఎమ్మెల్యే కన్నబాబు
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న నడకుదురు గ్రామస్తులు

కరప: దీర్ఘకాలిక సమస్యలకు నడకుదురు గ్రామంలో పరిష్కారం లభిస్తుండడంతో గ్రామస్తుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలో రోడ్లు, డ్రైన్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అధికారులను మొత్తుకున్నా, ప్రయోజనం లేకపోవడంతో ప్రజలు అసంతృప్తి చెందారు. వారి ఆవేదనకు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు స్పందించారు. ఆయన చొరవతో నిధులు మంజూరు కావడంతో ఆయా సమస్యలకు మోక్షం లభించింది.

గ్రామ శివారు ప్రాంతాలకు పూర్తి స్థాయిలో తాగునీరందక ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఎస్సీ, బీసీ, ఓసీ వీధులు, రామలింగేశ్వర కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లు, డ్రైన్లు పూర్తి స్థాయిలో లేక గ్రామస్తులు రాకపోకలు సాగించేందుకు, నానా అవస్థలు పడేవారు. డ్రైన్లు లేకపోవడంతో ఇళ్లలోని వాడకంనీరు, వర్షంనీరు పోయే మార్గం లేక వీధుల్లోనే నిలిచిపోయి, మురికికూపాలుగా దర్శనమిచ్చేవి. కొన్ని వీధుల్లో విద్యుత్ స్తంభాల్లేక చీకట్లోనే రాకపోకలు సాగించేవారు, డ్రైన్లు, రోడ్లు నిర్మించాలని ప్రజలు ఎన్నిసార్లు అడిగినా, గత టీడీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది.

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే కన్నబాబు ఇంటింటికీ పర్యటించారు. రోడ్లు, డ్రైన్లు లేక పడుతున్న ఇబ్బందులను, విద్యుత్ స్తంభాల్లేక చీకట్లోనే బతుకుతున్న పరిస్థితులను గ్రామస్తులు ఆయనకు విన్నవించుకున్నారు. వారి సమస్యలపై చలించిన ఎమ్మెల్యే కన్నబాబు.. నిధులు మంజూరు చేసి, రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తామని వారికి భరోసా ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు రెండు నెలల్లోనే గడప గడపకూ నిధులు రూ.80 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో ఆయా ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైన్లను నిర్మించారు. ఇవే కాక జెడ్పీ, పంచాయతీ నిధులు వెచ్చించి, అవసరమైన చోట్ల విద్యుత్ స్తంభాలు వేయించారు. వీటితో పాటు జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.1.20 కోట్లు మంజూరు చేయించి, వాటర్ ట్యాంక్, పైపులైన్ నిర్మించారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులు చేపట్టారు. నాడు-నేడు నిధులతో నడకుదురులోని ప్రాథమిక పాఠశాలలు, హైస్కూళ్లను ఆధునీకరించి, మౌలిక వసతులు కల్పించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి, హామీలు నెరవేరుస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు పనితీరుపై గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



నడకుదురు తులసీనగర్‌లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులకు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు(ఫైల్)



నడకుదురు రామలింగేశ్వరకాలనీలో నిర్మించిన సీసీ రోడ్ కం డ్రైన్



నడకుదురులోని ఓ సీసీ రోడ్ కం డ్రైన్

ఏడాదిలోనే రూ.3 కోట్ల అభివృద్ధి



గ్రామంలో ఈ ఒక్క ఏడాదే రూ.3 కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గడప గడపకూ కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగినప్పుడు గ్రామస్తులకు ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూ.80 లక్షలు మంజూరు చేయగా, జెడ్పీ, మండల పరిషత్, పంచాయతీ నిధులు మరో రూ.20 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో సీసీ డ్రైన్లు, రోడ్లు, విద్యుత్ స్తంభాలు వేయించాం. జల్‌జీవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులు జరుగుతున్నాయి. రూ.85 లక్షల నాడు-నేడు నిధులతో పాఠశాలల ఆధునీకరణ పనులు సాగుతున్నాయి. గ్రామ సచివాలయాల భవనాలు, వెల్నెస్ సెంటర్, ఆర్‌బీకే భవన నిర్మాణాలు జరుగుతున్నాయి.

– దేగల లలితకుమారి, సర్పంచ్, నడకుదురు

అఖిల భారత కాంగ్రెస్ మహాసభ శతాబ్ది ఉత్సవాలు

నిర్వహణకు ప్రముఖుల సమావేశం తీర్మానం

బాలాజీచెరువు: భారత స్వాతంత్య్ర పోరాటంలో భాగంగా 1923లో కాకినాడలో నిర్వహించిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభ డిసెంబర్ 28కి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలు నిర్వహించాలని ప్రముఖులు తీర్మానించారు. కాకినాడ విద్యుత్‌నగర్ ఐడియల్ కళాశాలలో డాక్టర్ పి.చిరంజీవిని కుమారి అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంతో వివిధ అంశాలపై చర్చించారు. స్వాతంత్య్ర పోరాటంలో సహాయ నిరాకరణ పిలుపుతో అఖిల భారత నాయకులు అల్లకల్లోల పరిస్థితుల్లో ఉండగా, దేశానికి ఈ సభ దిశానిర్దేశం చేసిందని వివరించారు. ఇది జరిగి వందేళ్లు పూర్తయిన సందర్భంగా.. నేటి తరానికి దీనిని కళ్లకు కట్టేలా చూపించాలని నిర్ణయించామన్నారు. స్వాతంత్య్ర సమర చరిత్ర పరిశోధనా సంస్థ, మహర్షి సాంబమూర్తి సంస్థ, రెడ్‌క్రాస్ వంటి సంస్థల సహకారంతో నిర్వహిస్తామని వెల్లడించారు. ముఖ్యఅతిథులుగా మహాత్మా గాంధీ మునిమనవడు గోపాలకృష్ణ గాంధీతో పాటు పలువురు ప్రముఖులను ఆహ్వానిస్తామని తెలిపారు. పోరాట చరిత్ర ఎగ్జిబిషన్‌తో పాటు స్వాతంత్య్ర పోరాటాలు వంటి వాటిపై ప్రత్యేక బ్రోచర్ ఆవిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ వైడీ రామారావు, అయ్యంగారి వెంకటేష్, వైవీఎస్ఎన్ మూర్తి, సరిపల్లె శ్రీరామచంద్రమూర్తి, చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రముఖ విద్యావేత్త డాక్టర్ చిరంజీవిని కుమారి

సంక్షేమ సారథి సీఎం జగన్

యండమూరులో 'వై ఏపీ నీడ్స్ జగన్'

కరప: కుల, మత, రాజకీయాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అన్నారు. యండమూరులో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ప్రతి పేద కుటుంబానికి అండగా ఉన్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబును, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎంపీపీ కోరారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు మాట్లాడుతూ పాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కావాలో, ప్రజలను మాయల గారడీతో బురిడీ కొట్టించే పార్టీలు కావాలో విజ్ఞతతో ఆలోచించాలన్నారు. తొలుత ప్రజాప్రతినిధులు, అధికారులు పథకాల డిస్‌ప్లే బోర్డ్‌ను ఆవిష్కరించారు. గ్రామ కార్యదర్శి పి.వీరభద్రరావు మాట్లాడుతూ యండమూరు సచివాలయం పరిధిలో వివిధ కార్యక్రమాలకు రూ.23.33 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు. అనంతరం గ్రామ కూడలిలో పార్టీ పతాకాన్ని నేతలు ఆవిష్కరించారు. మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, మండల కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ మార్నెళ్ల వెంకటరమణ, షేక్ దరియా, మీసాల విష్ణుచక్రం తదితరులు పాల్గొన్నారు.



యండమూరులో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు

చైతన్యం నింపే చిత్రం ఉక్కు సత్యాగ్రహం

బోట్‌క్లబ్: జనం ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నిర్మించిన ఉక్కు సత్యాగ్రహం చిత్రాన్ని డిసెంబర్ రెండో వారంలో విడుదల చేస్తామని చిత్ర నిర్మాత, దర్శకుడు సత్యారెడ్డి తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకం నిలిపివేయాలని కోరుతూ ఈ చిత్రం నిర్మించామన్నారు. కాకినాడలోని ఓ హోటల్‌లో బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డితో పాటు ప్రతిపక్ష నేతలు పవన్‌కల్యాణ్, చంద్రబాబునాయుడు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకించారని, అయినా కేంద్ర ప్రభుత్వం ఆ ప్రయత్నాన్ని మానుకోలేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ప్రజల అవగాహన కోసం ఈ చిత్రం నిర్మించామన్నారు. ఈ సినిమాలో గద్దర్ 4 పాటలు, గోరటి వెంకన్న మూడు పాటలు రాశారన్నారు. గద్దర్‌కు ఈ సినిమా అంకితం చేస్తున్నట్టు చెప్పారు. విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యే ధర్మశ్రీ, పోరాట సమితి జేఏసీ నాయకులు, ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకించే ప్రముఖులు ఈ చిత్రంలో నటించారన్నారు. సమావేశంలో ఆదిరాల జక్కరయ్య, అల్లి దావీదు, దాసరి అన్నారావు పాల్గొన్నారు.



చిత్ర వివరాలు వెల్లడిస్తున్న సత్యారెడ్డి

ప్రయోగాత్మకంగా సాంకేతిక పరిజ్ఞానం పొందాలి

సైన్స్ ఎగ్జిబిషన్‌లో వక్తలు

బాలాజీచెరువు: సైన్స్ విద్యార్థులు పరిశోధనాత్మకంగా ఆలోచించాలని ఆదిత్య డిగ్రీ కళాశాల కో-ఆర్డినేటర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు అన్నారు. కళాశాలలో సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో సైలాండ్-2023 ఐదో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పుస్తక జ్ఞానంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం ప్రయోగాత్మకంగా అభ్యసించినప్పుడే పరిపూర్ణం అవుతుందన్నారు. ముఖ్యఅతిథి పీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధన రంగంపై ఆసక్తి చూపాలని, ఇటువంటి సదస్సులో పాల్గొనడం ద్వారా విద్యార్థులు అభిప్రాయాలు పంచుకోవచ్చన్నారు. క్రీఫీ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ ఎండీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లుగా సైలాండ్ సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించడం అభినందనీయని, పరిశోధకులకు మంచి వేదిక అన్నారు. ఎగ్జిబిషన్‌లో భాగంగా రోబోరేస్, ఆర్గానిక్ వేస్ట్ నుంచి ఇథనాల్ తయారీ, సోయా మిల్క్ తయారీ, స్మార్ట్ హెల్మెట్, న్యూక్లియర్ పవర్‌పాయింట్ వంటి ప్రాజెక్టులు ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, పీవో తేజేశ్వరరావు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కృష్ణారెడ్డి, చిత్రంలో బీఈవీఎల్ నాయుడు, ప్రిన్సిపాల్ తిరుపాణ్యం

వేడుకలా లలితా కుంకుమార్చనలు

కాకినాడ రూరల్: కాకినాడ శ్రీపీఠంలో మహాశక్తి యాగంలో భాగంగా లలితా కుంకుమార్చనలు వేడుకలా జరుగుతున్నాయి. బుధవారానికి మహాశక్తి యాగం 16 రోజులు పూర్తయింది. శతకోటి కుంకుమార్చనలో భాగంగా 59 కోట్ల కుంకుమార్చనలు జరిపినట్టు పరిపూర్ణానందస్వామి తెలిపారు. సాయంత్రం కోటి దీపోత్సవ ప్రాంగణంలో నృత్య కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం దీపోత్సవం, బగళాముఖి హోమం ఘనంగా నిర్వహించారు.



కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

సుబుకోటా సేవలు అభినందనీయం

జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ ప్రసాదరాజు

బాలాజీచెరువు: సాంకేతిక విద్యను అభ్యసించే ఇంజినీరింగ్ విద్యార్థులను స్టార్టప్ దిశగా ప్రోత్సహిస్తున్న సుబుకోటా ఫౌండేషన్ సేవలు అభినందనీయని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. జేఎన్‌టీయూకేలో సీఎస్ఈ విద్యార్థులకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న స్పార్క్ బూట్ కార్యక్రమం బుధవారం ముగిసింది. వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ విద్యాసంస్థల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ, వ్యవస్థాపకతను పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. జేఎన్‌టీయూకే పూర్వ విద్యార్థి సుబు ఎం.కోటా ఈ ఫౌండేషన్ స్థాపించి, యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే దిశగా కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. ఇటీవల కళాశాల అభివృద్ధికి రూ.కోటి ప్రకటించారన్నారు. కళాశాలకు చెందిన 35 మంది విద్యార్థులు తమ ఆలోచనలు వివరించగా, వీరిలో మొదటి ముగ్గురికి బహుమతులు అందజేశారు. అనంతరం స్పార్క్ లాంచ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ ఎం.కోటాసుబు, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, ఇంక్యుబేషన్ సెంటర్ అడ్వయిజర్ జీవీఆర్ మూర్తి, సీఎస్ఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ రఘు, రాజశేఖర్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేసిన దృశ్యం

ఆరోగ్య ఉప కేంద్రంలో అగ్నిప్రమాదం

కరప: పెనుగుదురులోని ఆరోగ్య ఉపకేంద్రంలో బుధవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. కేంద్రంలోని మందులు, ఫర్నిచర్, రికార్డులు కాలిబూడిదయ్యాయి. రాత్రి సమయంలో సంఘటన జరగడం, సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చంటున్నారు. మండల వైద్యాధికారి, స్థానికుల కథనం ప్రకారం.. పెనుగుదురు సచివాలయం సమీపంలోనే ఈ కేంద్రం ఉంది. ఏఎన్ఎం దేవి, ఎంఎస్‌హెచ్ పావని, ఆశా వర్కర్లు తదితరులు కేంద్రంలో విధులు నిర్వర్తిస్తుంటారు. రెగ్యులర్ మందులతో పాటు, జగనన్న ఆరోగ్య సురక్షలో వచ్చిన మందులు, ఫర్నిచర్ ఉన్నాయి. బుధవారం సాయంత్రం 5 గంటలకు సిబ్బంది కేంద్రానికి తాళం వేసి వెళ్లిపోయారు. రాత్రి 8.30 సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఫర్నిచర్, టీవీ, రికార్డులు, మందులు కాలిపోయాయి. సర్పంచ్ రెడ్డిపల్లి వెంకటమాధవి, రమేష్, వైద్యాధికారి ఆర్.శ్రీనివాసనాయక్ కాకినాడలోని అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వగా, వారు మంటలను అదుపు చేశారు.

రెండు నెలల్లో 4,100 ఇళ్ల నిర్మాణాలు లక్ష్యం

నగరపాలక సంస్థ కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ సిటీ: కాకినాడ సిటీ నియోజకవర్గ లబ్ధిదారులకు స్థలాలు కేటాయించిన కొమరగిరి, పండూరు, ఏపీ త్రయం లేఔట్లలో డిసెంబర్ ఒకటి నుంచి జనవరి 31 వరకు రెండు నెలల్లో మెగా కంప్లీషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు తెలిపారు. నిర్దేశిత సమయంలో 4,100 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యమని వివరించారు. బుధవారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో గృహ నిర్మాణ ప్రగతిపై ఆయన హౌసింగ్, నగరపాలక సంస్థ అధికారులు, ప్రత్యేకాధికారులతో సమీక్ష నిర్వహించారు. మెగా కంప్లీషన్ డ్రైవ్ సందర్భంగా ఎటువంటి ఇబ్బందుల్లేకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. లబ్ధిదారులకు, కాంట్రాక్టర్లకు అవసరమైన నిర్మాణ సామగ్రి, ఇతర అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలన్నీ వేగం పుంజుకునేలా ప్రత్యేకాధికారులు దృష్టి పెట్టాలని కమిషనర్ ఆదేశించారు. గృహ నిర్మాణ ప్రగతిపై ప్రతి వారం సమీక్షిస్తానని స్పష్టం చేశారు. నిర్దేశిత లక్ష్యాలను అధిగమించేలా అధికారులంతా ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్లాలని ఆదేశించారు. సమావేశంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం ఏసుబాబు, హౌసింగ్ డీఈ సత్యనారాయణరెడ్డి, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్‌వో మానే కృష్ణమోహన్, వివిధ విభాగాధిపతులు, సూపరింటెండెంట్లు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ నాగనరసింహారావు

కొవ్వాడలో పెద్దఎత్తున సంక్షేమాభివృద్ధి

కాకినాడ రూరల్: అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొవ్వాడ గ్రామంలో పెద్దఎత్తున జరిగాయని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత గోపిశెట్టి బాబ్జీ తెలిపారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్ అధ్యక్షతన సచివాలయం వద్ద బుధవారం గ్రామసభ జరిగింది. రూ.28 కోట్లతో కూడిన పథకాల డిస్‌ప్లే బోర్డును ప్రదర్శించారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఈఓపీఆర్‌డీ రామాంజనేయులు, కార్యదర్శి వరప్రసాద్ వివరించారు. ముఖ్య అతిథి బాబ్జీ, ఉప సర్పంచ్ తోటకూర శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో సుమారు రూ.6 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని చెప్పారు. ప్రధానంగా రూ.1.5 కోట్లతో తాగునీటి సదుపాయం కల్పించినట్టు తెలిపారు. ఏఎంసీ డైరెక్టర్ జాన్‌ప్రభాకర్, అధికారులు పాల్గొన్నారు.



కొవ్వాడ గ్రామంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

క్షతగాత్రురాలికి ఎమ్మెల్యే పరామర్శ



కాకినాడ ఆస్పత్రిలో నూకరత్నం ఆరోగ్యపరిస్థితిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ క్రైం/కరప: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రురాలిని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పరామర్శించారు. కరప మండలం పెనుగుదురు గ్రామానికి చెందిన నక్కా నూకరత్నం పది రోజుల క్రితం ప్రమాదానికి గురై, కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని, కుటుంబ ఆర్థిక స్థితిని అదే గ్రామానికి చెందిన పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లి రమేష్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే కన్నబాబు బుధవారం క్షతగాత్రురాలు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. క్షతగాత్రురాలికి మెరుగైన వైద్యసేవలు అందించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతదేవికి సూచించారు.

ఆడ శిశువు సంబంధీకులు సంప్రదించాలి

కాకినాడ సిటీ: పొదల్లో విడిచిపెట్టిన ఆడశిశువు తల్లిదండ్రులు తమను సంప్రదించాలని, లేకపోతే చట్టబద్ధంగా దత్తత ఇస్తామని కాకినాడ జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి కె.ప్రవీణ తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల మూడున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎన్ కొత్తపల్లి గ్రామం గచ్చకాయలపొరకి వెళ్లే రోడ్డు పక్కన పొదల్లో ఆడశిశువును ఎవరో విడిచి వెళ్లిపోయారు. స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అమలాపురం ఏరియా ఆస్పత్రిలో పది రోజుల చికిత్స అనంతరం పాపను రాజమహేంద్రవరం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశానుసారం కాకినాడ జిల్లా మహిళా, శిశు సంక్షేమ నిర్వహణలోని శిశు గృహకు ఈ నెల 14న అప్పగించారు. ఈ పాపకు సంబంధించిన తల్లిదండ్రులు, రక్త సంబంధీకులు 30 రోజుల్లో తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని ప్రవీణ తెలిపారు. ఎవరూ రాకపోతే పాపను చట్టబద్ధంగా దత్తత ఇస్తామని స్పష్టం చేశారు.

నండూరికి నివాళులు

కాకినాడ సిటీ: కార్మికోద్యమ నేత, కామ్రేడ్ నండూరి ప్రసాదరావు 22వ వర్ధంతిని బుధవారం సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో కాకినాడ సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పలివెల వీరబాబు, ఎం రాజశేఖర్, దువ్వా శేషుబాబ్జీ, కె.సత్తిరాజు, వి.సుబ్బరాజు, కె.వీరబాబు, దుంపల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రపాలెం ఎస్సైగా మణికుమార్



కాకినాడ రూరల్: కాకినాడ రూరల్ సర్కిల్ పరిధిలోని ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్సైగా వడ్డాది మణికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎస్సైగా పని చేసిన దేవసుధ కొత్తగా వచ్చిన మణికుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. వీఆర్‌లో ఉండి ఇంద్రపాలెం ఎస్సైగా విధుల్లో చేరిన మణికుమార్‌కు సిబ్బంది స్వాగతం పలికారు. శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడతానని ఎస్సై మణికుమార్ చెప్పారు.

డీఎస్ఏలో 'థ్యాంక్యూ సీఎం'

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): జిల్లా క్రీడల శాఖను స్టెప్ నుంచి తొలగించి పూర్వవైభవం కలిగించినందుకు బుధవారం కాకినాడలోని జిల్లా క్రీడామైదానంలో చీఫ్ కోచ్ శ్రీనివాస్‌కుమార్ ఆధ్వర్యంలో థ్యాంక్యూ సీఎం కార్యక్రమం నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి, క్రీడల శాఖ మంత్రి రోజా, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రద్యుమ్న, శాప్ ఎండీ ధ్యానచంద్రకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ 2018 నుంచి ఇప్పటి వరకు స్టెప్‌లో విలీనమైన క్రీడల శాఖకు స్వయం ప్రతిపత్తి కల్పించడాన్ని స్వాగతించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డికి క్రీడాభివందనాలు తెలిపామన్నారు . పీఈటీలు, పీడీలు, క్రీడాసంఘా ప్రతినిధులు, కోచ్‌లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్ఏ చీఫ్‌కోచ్ శ్రీనివాస్‌కుమార్ తదితరులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

కాకినాడ రూరల్: వాకలపూడిలోని సన్‌రైజ్ స్కూల్‌లో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్వాతి స్పీచ్ అండ్ హియరింగ్ కేర్ సెంటర్, సన్‌రైజ్ స్కూల్ యాజమాన్యం సహకారంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని కాకినాడ రూరల్ నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన వైద్య శిబిరంలో మెడికవర్ హాస్పిటల్, ఎపెక్స్ ఈఎన్‌టీ హాస్పిటల్ వైద్యులు సుమారు 300 మందికి సేవలందించారు. ఉచితంగా మందులు అందజేశారు. సెంటర్ అధినేత శ్రీను నాయక్, ఎపెక్స్ ఈఎన్‌టీ హాస్పిటల్ అధినేత డాక్టర్ కె.శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు జంగా గగారిన్, వక్ఫ్‌బోర్డు జిల్లా కార్యదర్శి కరీం బాషా, కర్రి చక్రధర్, ఏఎంసీ డైరెక్టర్లు రెడ్డి నాయకుడు, రాజు పాల్గొన్నారు.